సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 20 । మే । 2023



భారీగా మద్యం సీజ్

గణపవరం మండలం పిప్పరలో ఇతర రాష్ట్రాలకు చెందిన రూ.2.38 లక్షల విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పలువురిని అరెస్టు చేశారు. IIలో ▸



మద్యం మత్తులో హల్‌చల్

జంగారెడ్డిగూడెంలోని అశ్వారావుపేట రోడ్డులోని మద్యం మత్తులో నలుగురు యువకులు కారుతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. IIలో ▸

ఆర్టీసీకి మంచి ఆదాయం

పశ్చిమ గోదావరి జిల్లా ఆర్టీసీకి ప్రత్యేక సర్వీసులతో మంచి ఆదాయం వస్తోంది. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఈ ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. IIలో



న్యూస్‌రీల్

జూన్ 5న మేరీ లైఫ్- మేరా స్వచ్ఛ షహర్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, అధికారులు

ఏలూరు(మెట్రో): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 5న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మేరీ లైఫ్- మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఇందుకు సంబంధించిన లోగోను శుక్రవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించడానికి సాధ్యమయ్యే అన్ని మార్పులు చేసుకుంటానని కార్యక్రమంలో పాల్గొన్న వారితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యత గురించి ఇతరులను నిరంతరం ప్రేరేపించడానికి కూడా కట్టుబడి ఉంటానని ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరి జీవనశైలిలో మార్పు రావాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంభించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, నగరపాలక సంస్థ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, జీఎస్‌డబ్ల్యూఎస్ స్పెషల్ ఆఫీసరు రమణ, పలువురు గ్రామ, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేకాధికారి



జేసీ బి.లావణ్యవేణిని కలిసిన ఏపీఈపీడీసీఎల్ జిల్లా ప్రత్యేక అధికారి ఎం.లక్ష్మణరావు

ఏలూరు(మెట్రో): జిల్లాలో పవర్ సప్లయ్ మానిటరింగ్, విద్యుత్ సరఫరా స్థితిని సమీక్షించడానికి విశాఖపట్నం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి జనరల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావును ఏలూరు జిల్లాకు ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎం.లక్ష్మణరావు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌కు చేరుకుని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణిని మర్యాదపూర్వకంగా కలిశారు. లక్ష్మణరావు జిల్లాలో విద్యుత్ సరఫరా స్థితిని సమీక్షిస్తూ నిరంతర విద్యుత్ సరఫరాను అమలు చేయడానికి ట్రాన్స్‌కోతో సమన్వయం చేస్తారు. జిల్లా యంత్రాంగంతో సమావేశమై జిల్లాలో విద్యుత్ సరఫరా పరిస్థితిని సమీక్షిస్తారు.

అదనపు ఎస్పీగా ఎంజేవీ భాస్కరరావు



ఎంజేవీ భాస్కరరావు, అదనపు ఎస్పీ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా అదనపు ఎస్పీగా ఎంజేవీ భాస్కరరావును నియమించారు. ప్రభుత్వం తాజాగా చేపట్టిన పదోన్నతులు, బదిలీల్లో ఆయన పదోన్నతిపై ఏలూరు జిల్లాకు వస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన తూర్పుగోదావరి జిల్లా సీసీఎస్ డీఎస్పీగా పనిచేస్తున్నారు. రెండు రోజుల్లోనే ఆయన జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది డీఎస్పీలకు ప్రభుత్వం పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చాలా కాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తుండగా తాజా ఉత్తర్వులతో అదనపు ఎస్పీలుగా పదోన్నతులు లభించాయి. ఎంజేవీ భాస్కరరావుకు ఉమ్మడి పశ్చిమలో పనిచేసిన అనుభవం ఉంది. భీమడోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, ఏలూరు ఎస్బీ సీఐగా ఆయన పనిచేశారు. అనంతరం డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఏలూరు ఇంటెలిజెన్స్ డీఎస్పీగా కూడా పనిచేశారు. జిల్లాలో పనిచేసిన అనుభవంతో పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన చెబుతున్నారు.

జేవీకే స్టాక్ పాయింట్ పరిశీలన

తాడేపల్లిగూడెం రూరల్ : పట్టణ పరిధిలోని పడాలలో జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను శుక్రవారం డీవైఈవో ఎస్.రవీంద్రభారతి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠ్య పుస్తకాలు, షూస్, స్నాక్స్, బ్యాగ్‌లు, యూనిఫాంల నాణ్యత తనిఖీ చేశారు. నోట్ బుక్స్, బెల్ట్‌లు, డిక్షనరీలు వారం రోజుల్లో పూర్తి స్థాయిలో వస్తాయన్నారు.

సాగులో యంత్రాల చేయూత

- రైతుభరోసా కేంద్రాల ద్వారా ట్రాక్టర్లు, ఇతర యంత్రాలు
- ప్రతి గ్రూపుకి రూ.15 లక్షలతో యాంత్రీకరణ పనిముట్లు
- ఏలూరు జిల్లాలో 234, పశ్చిమలో 141 గుర్తింపు



జంగారెడ్డిగూడెం మండలంలో సబ్సిడీపై రైతులకు ట్రాక్టర్లు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతుకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వేసిన విత్తు దగ్గర నుంచి సాగులో సస్యరక్షణ, పంట కోత, గిట్టుబాటు ధర వరకూ జగనన్న సర్కారు అన్ని చర్యలు తీసుకుంటుంది. ఇందుకోసం రైతులకు సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఆ కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తోంది. తాజాగా రైతుకు యాంత్రీకరణ పనిముట్లు అందించేందుకు చర్యలు తీసుకుంది.

కూలీలు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్న ప్రస్తుత తరుణంలో యంత్రాలు రైతుకు ఎంతో మేలు చేస్తున్నాయి. అయితే యంత్రాల ఖరీదు ఎక్కువగా ఉండడంతో కొనేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే సేవల్లో భాగంగా ప్రస్తుతం యాంత్రీకరణ పనిముట్లు అందించేందుకు సిద్ధమైంది. కస్టమ్ హైరింగ్ సెంటర్లుగా నలుగురు రైతులను గుర్తించి వారికి ట్రాక్టర్లు, ఇతర రొటోవేటర్లు, కలివేటర్లు అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. తద్వారా ఇతర రైతులకు సైతం ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా అందించే పనిముట్లతో వ్యవసాయ పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది.

40 శాతం వరకూ రాయితీ

రైతు భరోసా కేంద్రానికి అనుసంధానంగా ఆ నలుగురు రైతులకు రూ.15 లక్షలతో కూడిన వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందిస్తారు. దీనిలో భాగంగా ట్రాక్టర్, ట్రాక్టర్‌తో అనుసంధానమైన రొటోవేటర్, కల్టివేటర్ వంటివి అందిస్తూ రూ.15 లక్షలకు 40 శాతం వరకు రాయితీ అందిస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా ఏలూరు జిల్లాలో 520 రైతు భరోసా కేంద్రాల పరిధిలో గతేడాది 286 యూనిట్లను రూ.8.8 కోట్లు వెచ్చించి రైతులకు అందించింది. వీటిలో 151 ట్రాక్టర్లు రైతులకు మొదటి విడత మెగా మేళా ద్వారా జిల్లా అధికారులు అందించారు. అదే విధంగా ప్రస్తుతం 2022–23 సంవత్సరంలో 234 యూనిట్లను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 389 రైతుభరోసా కేంద్రాల పరిధిలో 112 కస్టమ్ హైరింగ్ సెంటర్లకు గతేడాది రూ.8 కోట్లతో 63 ట్రాక్టర్లు, వివిధ రకాల యంత్రాలు అందించారు. ప్రస్తుతం 2022–23 సంవత్సరంలో 141 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 141 కస్టమ్ హైరింగ్ సెంటర్లకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, ట్రాక్టర్లు, రోటోవేటర్లు, కల్టివేటర్లు అందించేందుకు పశ్చిమగోదావరి జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కొక్క గ్రూపుకు రూ. 15 లక్షలు వర్తించే వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు (ట్రాక్టర్లు వగైరా వంటివి) 40 శాతం రాయితీతో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మొదటి విడతలో రూ. 8.8 కోట్ల యంత్రాల పంపిణీ



ఏలూరు జిల్లాలో మొదటి విడతలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల కోసం రూ. 8.8 కోట్లతో అందించాం. రెండో విడతలో మెగా మేళా త్వరలో నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ట్రాక్టర్లు, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా నిర్ణయించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. మొదటి విడతలో అందించిన విధంగానే మరోమారు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అందించేందుకు చర్యలు చేపట్టాం.

– వై.రామకృష్ణ, వ్యవసాయ శాఖ జేడీ

గోదావరి కాల్వపై కొత్త వంతెనకు శ్రీకారం

రెండు రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, ధవళేశ్వరం సీఈ ఆర్.సతీష్‌కుమార్

భీమడోలు: గోదావరి కాల్వపై భవిష్యత్తు అవసరాలను దృష్టిని ఉంచుకుని కొత్త వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నామని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం గోదావరి కాల్వపై శిథిలమైన వంతెనను కూల్చే పనులను ప్రారంభించారు. నూతనంగా వంతెన నిర్మించే ప్రాంతాన్ని ధవళేశ్వరం సీఈ రేవు సతీష్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కొత్త వంతెన డిజైన్ మ్యాప్ పరిశీలించారు. వంతెనను నేషనల్ అథారిటీ సంస్థకు చెందిన ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్రనాథ్ పర్యవేక్షణలో జీఆర్ నిర్మాణ సంస్థ చేపడుతుందన్నారు. మరో రెండు రోజుల్లో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. నీటిని విడుదల చేసే నాటికి వంతెన ప్రధాన పనులు పూర్తి చేస్తారన్నారు. కొత్త వంతెనపై డబుల్ లైన్ వల్ల ఒకేసారి రెండు వాహనాలు వెళ్తాయన్నారు. 100 టన్నుల సామర్థ్యం కలిగిన భారీ వాహనాలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

గిరిజన, కొండరెడ్ల స్థితిగతులపై ఆరా

పోలవరం రూరల్: రవాణా సౌకర్యం లేని అత్యంత మారుమూల దట్టమైన అటవీ ప్రాంతంలో గిరిజన, కొండరెడ్ల హస్త కళాకారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళా అభివృద్ధి కార్పొరేషన్(లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, వైటీసీ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన, కొండరెడ్ల జీవన స్థితిగతులపై ఆరా తీశారు. రెండో రోజు పర్యటనలో భాగంగా గడ్డపల్లి, తంగేడుకొండ, కల్లుమామిడి గ్రామాల్లో హస్త కళాకారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు.

వివిధ రకాల గృహ అలంకరణ వస్తువుల తయారీకి శిక్షణ అందించాలని, సోలార్ పవర్ ఏర్పాటుచేసి గిరిజనులకు, కొండరెడ్లకు ఉపాధి కల్పించాలని కళాకారులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. డీసీహెచ్ నుంచి గుర్తింపు కార్డులు ఇప్పించాలని, లేపాక్షి ఎంపోరియంల ద్వారా తాము తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం గిరిజనులు వెదురుతో తయారు చేసిన వివిధ కళాకృతులను పరిశీలించారు. ఈ పర్యటనలో సానుకూలంగా స్పందించిన చైర్‌పర్సన్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. అనంతరం అక్కడ కళాకారులు తమకు అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, చేదోడు, ఆసరా, పెన్షన్ పథకాలు అందుతున్నాయని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ 1వ డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సురేష్, వైటీసీ మేనేజర్ రాజు, సర్పంచ్ ముక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

- కలెక్టర్ పి.ప్రశాంతి
- వలంటీర్లకు సేవా పురస్కారాల బహూకరణ





వలంటీర్లకు చెక్కు నమూన అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్.. గూడెంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు, కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): ఆపదలో ఉన్నవారికి ఆపద మిత్రలుగా, సంక్షేమ కార్యక్రమాలు అందించే సంక్షేమ సారథులుగా వలంటీరు వ్యవస్థ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం భీమవరంలోని త్యాగరాజ భవన్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో వలంటీర్లకు వందన కార్యక్రమం ప్రారంభించి ప్రసంగించిన కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శంగా అందిస్తూ ప్రజల ప్రేమాభిమానాలను పొందుతున్నారన్నారు. వలంటీర్లు కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ధైర్యంగా ప్రజలకు సేవలు చేశారని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల ముంగిటకు తీసుకువెళ్లుతున్న వలంటీర్లు నిజమైన సంక్షేమ సేవకులని అన్నారు. పురస్కారం పొందలేని వలంటీర్లు పోటీ పడి ఉత్తమ సేవలు అందించి వచ్చే సంవత్సరం పురస్కారం అందుకునేలా కృషి చేయలన్నారు. జిల్లా వ్యాప్తంగా 8370 మంది సేవా మిత్రలు, 128 మంది సేవా రత్నలు, 35 మంది సేవ వజ్రలను ఎంపిక చేశామని వీరిని ఆయా నియోజకవర్గ స్థాయిలో సన్మానిస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లా మొత్తం 8,533 మందికి రూ 8.73 కోట్లు ప్రోత్సాహంగా అందించారన్నారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న వలంటీర్లకు కలెక్టర్ ప్రశాంతి శుభాకాంక్షలు తెలిపారు.

వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్, గ్రామ వార్డు సచివాలయం వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎక్కడ లేని విధంగా ప్రజల ముంగిటకు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలు అందించడంలో వలంటీర్ల కృషి వెలకట్టలేమన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కొద్ది మందికే లభిస్తుందని ఈ అవకాశాన్ని వలంటీర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్ డి.అఖిల, ఆర్డీఓ దాసి రాజు, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ వెంద్ర వెంకటస్వామి, ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, ఏఎస్ రాజు, కోడే యుగంధర్, జేసీఎస్ కన్వీనర్లు గాదిరాజు తాతరాజు, నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఆదర్శనీయం

తాడేపల్లిగూడెం అర్బన్: కరోనా విజృంభించిన సమయంలో వలంటీర్లు అందించిన సేవలు దేశానికే ఆదర్శనీయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక మాగంటి కళ్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, కలెక్టర్‌లు తాడేపల్లిగూడెం పట్టణ, మండలాల్లోని వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులతో సత్కరించారు.

చంద్రబాబు పేదల వ్యతిరేకి

- పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ఓర్వలేక పోతున్నారు
- ఉమ్మడి పశ్చిమలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజల నిరసన



పాలకోడేరు మండలం వేంద్ర గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరంలో పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేపట్టిన ఎమ్మెల్యే ఎలీజా



తణుకులో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, లబ్ధిదారులు



గణపవరం మండలం పిప్పరలో చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రదర్శన

సాక్షి నెట్‌వర్క్: పేదోడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందచేసిన సొంతింటి స్థలంపై ప్రతిపక్షనేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం తణుకు నరేంద్ర సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, లబ్ధిదారులు శుక్రవారం ధర్నాకు దిగారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ అత్తిలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇరగవరం మండలం రేలంగిలో వైస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తే చంద్రబాబు ఓర్వలేకపోతున్నాడని పేర్కొన్నారు. పాలకోడేరు మండలం వేంద్రలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన తెలిపారు.

ఏలూరు జిల్లాలో.. చంద్రబాబు మతిచలించి మాట్లాడుతున్నాడని, వయసుకు తగ్గ హుందాతనం లోపించిందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు విమర్శించారు. పేదల ఇళ్లస్థలాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఉంగుటూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం గణపవరం మండలం పిప్పరలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇళ్ల స్థలాలపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పోలవరం గ్రామంలోని ఏటిగట్టు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెబుతున్న చంద్రబాబు ఈ విధంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. పేదల ఇళ్ల స్థలాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్ని నిరసిస్తూ నూజివీడు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు విలేకర్ల సమావేశం నిర్వహించారు. పేదలు బాగుపడుతుంటే చంద్రబాబు ఓర్వలేడని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని జీవో తీసుకువచ్చిన చరిత్రహీనుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరంలో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం ధర్నా చేశారు. చంద్రబాబు అహంకార ధోరణి నశించాలని, డౌన్ డౌన్ చంద్రబాబు నాయుడు అంటూ నినాదాలు చేశారు.

టెక్నాలజీని సరిగా వినియోగించుకోవాలి

మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ జనార్ధన్



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ గుంపుల జనార్ధన్

నరసాపురం రూరల్: రోజు రోజుకూ విద్యావ్యవస్థలో ఎన్నోమార్పులు చోటు చేసుకుంటున్నాయని, దానికి తోడు విద్యార్థులు టెక్నాలజీని సరైన రీతిలో ఉపయోగించుకుంటే ఉన్నత స్థితికి చేరుకోవచ్చునని మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ గుంపుల జనార్ధన్ అన్నారు. శుక్రవారం నరసాపురం మండలం సీతారామపురం నార్త్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1967 నుంచి 1974 వరకూ విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక్క క్లిక్‌తో తమకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టుకునే సౌకర్యం ఈ తరం విద్యార్థులకు అందుబాటులో ఉందన్నారు. గూగుల్, యూట్యూబ్, ఆన్‌లైన్ గేమ్స్, మొబైల్ ఫోన్‌ల వినియోగాన్ని కేవలం తమకు కావాల్సిన సమాచారాన్ని పొందడానికి మాత్రమే వినియోగించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. తన విధి నిర్వహణలో మధ్యప్రదేశ్ లోని ఉజ్జయినిలో వరుస హత్యలు చేసిన సీరియల్ కిల్లర్ కేసును చేధించి ఉరిశిక్ష పడేలా చేశానన్నారు. తాము చదివిన పాఠశాల సహాయకులు పూతినీడి రాముడు, గుడవల్లమ్మ, విశ్రాంత ఉపాధ్యాయుడు మేళం అప్పారావు, అడిషనల్ డీజీపీ గుంపుల జనార్ధన్‌లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

పంచారామక్షేత్రంలో క్యూలైన్లకు స్టీల్ గ్రిల్స్


ఆలయ మండపంలో స్టీల్ గ్రిల్స్ వేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్లకు స్టీల్ గ్రిల్స్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ఆలయంలో ఉత్సవాలు సమయం, కార్తీక మాసంలో కార్తీక సోమవారం, దేవీ శన్నవరాత్రులు, శివరాత్రి పర్వదినాల్లో ఆలయానికి భక్తులు వేలాదిగా తరలి వస్తుంటారు. ఈ సమయంలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లను ఏర్పాటుచేస్తుంటారు. క్యూలైన్లు కర్రలతో ఏర్పాటు చేయడం వల్ల అధిక వ్యయం అవుతుందని అధికారులు చెబుతున్నారు. సుమారు రూ.23 లక్షలతో ఆలయ మండపంలో, ఆలయంలో నందీశ్వరుని వద్ద స్టీల్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ, ఆలయ తాజా మాజీ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ప్రత్యేక సర్వీసులతో ఆర్టీసీకి మంచి ఆదాయం

- ఏడాదికి రూ. 50 లక్షల నుంచి రూ.99.30 లక్షల వరకు ఆదాయం
- పశ్చిమ ఆర్టీసీని ఆదరిస్తున్న ప్రయాణికులు
- ప్రైవేటు దందాకు చెక్

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా ఆర్టీసీకి ప్రత్యేక సర్వీసులు ద్వారా మంచి ఆదాయం లభిస్తోంది. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ప్రతి ఏటా సంక్రాంతి, దసరా, కార్తీక మాసం, మహాశివరాత్రి, తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులను నడుపుతోంది. టిక్కెట్ సాధారణ ధరలకే ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపి ప్రజలకు బాగా చేరువైంది.

రికార్డు స్థాయి ఆదాయం

ఆర్టీసీకి ప్రత్యేక సర్వీసుల ద్వారా ఏడాదికి రూ.50 లక్షల నుంచి రూ.99.30 లక్షల వరకు ఆదాయం లభిస్తోంది. ప్రతి ఏడాదీ సంక్రాంతి పండుగకు ఆర్టీసీకి ఎక్కువ ఆదాయం వస్తుంది. సంక్రాంతి పండుగకు హైదరాబాద్, విశాఖపట్టణం, విజయవాడ ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా ఈ మూడేళ్లలో ఆయా సంక్రాంతి పండుగలకు రూ.36.93 లక్షల నుంచి రూ.54.62 లక్షల వరకు ఆదాయం వచ్చింది. దసరా పండుగకు లాక్‌డౌన్ తర్వాత ఆదాయం చూస్తే రెండు దసరా పండుగలకు రూ.8 నుంచి రూ.12 లక్షల వరకు ఆదాయం వచ్చింది. 2022–23 గతేడాదిలో ఆర్టీసీ రూ.99,30,971 రికార్డు స్థాయి ఆదాయం లభించింది.

అరుణాచలం సర్వీసుల ద్వారా రూ.9.63 లక్షల ఆదాయం

పశ్చిమ ఆర్టీసీ అరుణచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మార్చి నెల నుంచి ఇప్పటివరకు 10 ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా రూ.9,63,416 ఆదాయం లభించింది. మార్చి నెలలో రెండు బస్సుల ద్వారా రూ.1,72,06, ఏప్రిల్ నెలలో నాలుగు బస్సులు ద్వారా రూ.4,03,028, మే నెలలో ఇప్పటి వరకు నాలుగు బస్సు సర్వీసుల ద్వారా రూ.3,88,326 ఆదాయం ఆర్టీసీకి వచ్చింది.



ప్రైవేటు బస్సుల దందాకు చెక్

పండుగ సీజన్లు, తీర్థయాత్రలకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు వారు టిక్కెట్ అధిక ధరలతో ప్రజలను దోపిడీ చేసేవారు. ట్రావెల్స్ అంతా సిండికేట్‌గా మారి టిక్కెట్ ధరలను భారీగా పెంచేవారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపడంతో ప్రైవేటు బస్సుల వ్యాపార దందాకు చెక్ పెట్టినట్టయింది. ప్రజలు కూడా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను చక్కగా ఉపయోగించుకుంటున్నారు. ప్రయాణికులకు రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను, ప్రజలు కోరుకున్న యాత్రలకు బస్సులను నడుపుతోంది.

మూడేళ్లలో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల ఆదాయం ఇలా..

ఏడాది	సందర్భం	ప్రత్యేక బస్సులు	ఆదాయం
2020–21	సంక్రాంతి	113	రూ.36,93,035
	పంచారామాలు	4	రూ.80,313
	అంతర్వేది	75	రూ.7,04,161
	శివరాత్రి	43	రూ.4,37,976
2021–22	దసరా	33	రూ.8,29,774
	సంక్రాంతి	130	రూ.36,88,814
	పంచారామాలు	23	రూ.826424
	అంతర్వేది	70	రూ.692754
	శివరాత్రి	28	రూ.423779
2022–23	దసరా	74	రూ.1206549
	సంక్రాంతి	197	రూ.54,62,808
	పంచారామాలు	95	రూ.32,54,789
	అంతర్వేది	81	రూ.8,10,692
	శివరాత్రి	25	రూ.4,02,682

పుంజుకుంటున్న ఆదాయం



పండుగలకు, దైవ దర్శనాలకు జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. టిక్కెట్ సాధరాణ ధరలకే సర్వీసు చేయడంతో ప్రజలు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఆదరిస్తున్నారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ద్వారా మంచి ఆదాయం వస్తుంది. పండుగల సీజన్‌లో కాకుండా ప్రస్తుతం అరుణచలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. వేసవి సెలవుల నేపథ్యంలో విశాఖ విహార యాత్రకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నాం. కోవిడ్ లాక్ డౌన్ తర్వాత ఆర్టీసీ ఆదాయం పుంజుకుటుంది.

– ఎ.వీరయ్య చౌదరి, ప్రజా రవాణా అధికారి, భీమవరం

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

తణుకు: తణుకు రైల్వే అవుట్ పోలీసు స్టేషన్ పరిధిలో అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఒక వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ఉత్తర్ దినంజ్‌పూర్ జిల్లా దక్షిణ్ కృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఫార్జున్ రామ్ (45) శుక్రవారం గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫార్జున్‌రామ్ శరీరభాగాలు ఛిద్రమయ్యాయి. ఫార్జున్‌రామ్ ఇక్కడకు ఎందుకు వచ్చారనే విషయంపై రైల్వే పోలీసులు ఆరా తీస్తున్నారు. భీమవరం రైల్వే ఎస్సై పీటీవీ రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెనుమంట్ర : కాళ్ల మండలం జక్రం గ్రామం నుంచి తూర్పుగోదావరి జిల్లాకు అక్రమంగా తరలిస్తోన్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పెనుమంట్ర రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకుని, పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. జక్రం వాసి అందేపల్లి నాగవెంకట మణికంఠకు చెందిన మినీ వాహనంలో గురువారం ఉదయం రూ.63 వేలు విలువ చేసే 3.5 టన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఆలమూరు వద్ద అధికారులు పట్టుకున్నారు. దీంతో లారీ యజమాని నాగవెంకట మణికంఠ, డ్రైవర్ భీమవరానికి చెందిన పలసాని నాగరాజుతోపాటు బియ్యాన్ని తరలిస్తున్న అందేపల్లి కిషోర్‌లపై పెనుమంట్ర సివిల్‌సప్లయ్ ఆర్ఐ వి.పోతురాజు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి, భీమవరం: రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ సారథ్యంలో నడుస్తోన్న పాఠశాలల్లో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు ప్రవేశానికి ఈనెల 20న నిర్వహించే పరీక్షకు భీమవరంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లూ చేశామని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగా హాజరుకావాలని తెలిపారు.

సచివాలయం, అంగన్‌వాడీల తనిఖీ


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌డీసీ సూర్యనారాయణరెడ్డి

టి.నరసాపురం: స్పందన ఫిర్యాదులు అర్థవంతంగా పరిష్కరించాలని చింతలపూడి ఎత్తిపోతల పథకం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.సూర్యనారాయణరెడ్డి ఆదేశించారు. బొర్రంపాలెం సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. సచివాలయంలో ప్రతిరోజు స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు, అవే సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి నిత్యం సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బంది పనితీరు, వారికి సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, సిబ్బంది పనితీరు, రికార్డులను తనిఖీ చేశారు. పౌష్టికాహారం చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందే తీరును అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో కొద్దిసేపు మాట్లాడారు.

● సంక్షేమ కాంతులు


పాలకోడేరు: మండలంలోని వేంద్ర గ్రామంలో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

పోడూరు: మార్టేరు – కోడేరు రహదారి మార్గంలో గురువారం రాత్రి పండితవిల్లూరు గ్రామంలో రైస్‌మిల్లు వద్ద ఆగిఉన్న ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొని అదే గ్రామానికి చెందిన దిగుపాటి చంద్రరావు (34) మృతి చెందాడు. రాత్రి 10 గంటల సమయంలో చంద్రరావు వ్యవసాయ పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై ఆచంట వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రగాయాలైన చంద్రరావును 108 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చంద్రరావుకు భార్య జయలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. చంద్రరావు సోదరుడు సాల్మన్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై కె.నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబును తక్షణమే అరెస్ట్ చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకొంటున్న చంద్రబాబు నాయుడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికే వరప్రసాదరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమరావతిలో ఇళ్ల స్థలాలపై సుప్రీంకోర్టు తీర్పుతో పేదల సొంత ఇంటి కల నెరవేరుతుందని, పేదలకు సాయం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూస్తుంటే చంద్రబాబు నాయుడుకు బాధ ఎందుకని ప్రశ్నించారు. అమరావతి ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే పేదలపై విషయం కక్కుతున్న ఎల్లో మీడియా, ఎల్లో బ్యాచ్‌కి 2024లో ఓటు ద్వారా బుద్ధి చెప్తామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పేదలు చంద్రబాబునాయుడుకి, బీజేపీకి, సీపీఐ, సీపీఎంలకు జనసేన పార్టీలకు ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను శ్మశానాలతో పోల్చి చంద్రబాబు పేదలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పుట్టిన రోజు నాడే మృత్యుఒడిలోకి

జంగారెడ్డిగూడెం: పుట్టిన రోజే రోడ్డు ప్రమాదానికి గురవడంతో ఒక వ్యక్తి మృత్యువాతపడ్డాడు. గురువారం రాత్రి స్థానిక జాతీయ ప్రధాన రహదారి (516డి)పై జరిగిన రోడ్డు ప్రమాదంలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుని మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళుతున్న గోపిశెట్టి సురేష్ అలియాస్ రిషి (25) లారీ రూపంలో మృత్యువు కబళించింది. వంట మేస్త్రిగా పనిచేస్తోన్న గోపిశెట్టి సురేష్ ఈ నెల 18వ తేదీ పుట్టిన రోజు కావడంతో స్నేహితులతో సరదాగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకుని మోటార్‌సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. రాత్రి 11 గంటల సమయంలో స్థానిక బాలాజీనగర్ దుర్గమ్మ గుడి సమీపానికి వచ్చేసరికి అతివేగంగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సురేష్ భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదుతో లారీ డ్రైవర్ మైఖేల్‌రాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సురేష్‌కు భార్య భవాని, ఒక పాప ఉన్నట్టు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో యువకుల హల్‌చల్


విద్యుత్ స్థంభాన్ని ఢీకొన్న కారు

జంగారెడ్డిగూడెం: మద్యం సేవించిన నలుగురు యువకులు కారులో హల్‌చల్ చేస్తూ స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని వినాయకగుడి వీధిలో ఒక విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో స్తంభం కారుపై పడి ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఆ సమయంలో విద్యుత్ ట్రిప్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. యడ్లపల్లి బాలసాయి, బోడా జ్యోతివర్ధన్, గాలింకి ప్రిన్స్ అలియాస్ బన్ను, మడకం భవానీ నాగ సురేంద్ర పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కారులో వెళ్లి మున్సిపల్ పార్కు సమీపంలో మద్యం సేవించారు. తిరిగి మద్యం మత్తులో కారులో వస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఘటనా స్థలానికి స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నిలిచిన ట్రాఫిక్‌ను క్లియర్ చేసి నలుగురి యువకులను స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, విద్యుత్ ఏడీఈ యు.సుబ్బారావు, ఏఈ ఎ.సునీత ఘటనా స్థలానికి చేరుకుని తమ సిబ్బందితో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్‌ను గంటల వ్యవధిలో పునరుద్ధరించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు.

400 మద్యం సీసాల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్పీ రవిప్రకాష్, తదితరులు

గణపవరం: గణపవరం మండలం పిప్పర గ్రామం కేంద్రంగా అరుణాచల్‌ప్రదేశ్, పాండిచ్చేరి, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు రూ.2.38 లక్షల విలువైన 400 మద్యం సీసాలను గణపవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను గణపవరం పోలీస్‌స్టేషన్‌లో పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాష్ శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. పిప్పర గ్రామానికి చెందిన రావిపాటి శ్రీనివాసరావు, కొలనువాడ సురేష్‌రాజు అనే వ్యక్తులు ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన పాపినాయుడు అనే లారీ డ్రైవర్ నుంచి ఇతర రాష్ట్రాల మద్యం సీసాలను కొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన జుత్తిగ నాగేశ్వరరావు, గాదిరాజు రాంబాబు, తోటకూర శివరామరాజు, ఇందుకూరి సూర్యనారాయణరాజు అనే వ్యక్తుల ద్వారా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. డీఎస్పీ శ్రీనాథ్, సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి ఆదేశాల మేరకు గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు చేసి మద్యం విక్రయిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పలు బ్రాండ్లకు చెందిన 400 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇందుకూరి సూర్యనారాయణరాజు అనే వ్యక్తిని అరెస్టు చేయాల్సుంది. మద్యం గుట్టు రట్టుచేయడంలో సహకరించిన తాడేపల్లిగూడెం రూరల్ ఎస్సై, పెంటపాడు ఎస్సైలతోపాటు హెచ్‌సీ రత్నప్రసాద్, పీసీలు కాంతయ్య, భీమరాజు, హోంగార్డు జగపతి తదితరులను ఎస్పీ రవిప్రకాష్ అభినందించారు.

ఈఏపీ సెట్‌లో తొలి అంకం పూర్తి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తోన్న ఏపీ ఈఏపీ సెట్ పరీక్షల ఐదో రోజు శుక్రవారం ఉదయం ఒక పూట నిర్వహించిన పరీక్షతో తొలి అంకం పూర్తయింది. ఈ నెల 15 నుంచి ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల వ్యాప్తంగా 10 కేంద్రాల్లో ఇంజిగ్ కళాశాలల్లో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించారు. ఐదోజు రెండు జిల్లాల వ్యాప్తంగా మొత్తం 1,574 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని అధికారులు తెలిపారు. ఏలూరు జిల్లాలో సిద్ధార్థ క్వెస్ట్ సెంటర్ 180 మందికి 175 మంది పరీక్షకు హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 130 మందికి 126 మంది హాజరు కాగా నలుగురు, సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 148 మందికి 146 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 1,051 మందికి 1,027 మంది హాజరయ్యారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ పరీక్షల్లో ఏలూరు జిల్లా నుంచి 4,147 మందికి 4,027 మంది పరీక్షలు రాయగా, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 9,408 మందికి 9,116 మంది పరీక్షలు రాశారు. కాగా ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం చివరి అంకంగా ఈ నెల 22, 23 తేదీల్లో ఈఏపీ సెట్ పరీక్షలు నిర్వహించనున్నారు.

మానవత ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా మోహన్‌రావు


మోహన్‌రావును అభినందిస్తున్న మానవత వ్యవస్థాపక చైర్మన్ రామచంద్రారెడ్డి (ఫైల్)

పెంటపాడు: మానవత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చైర్మన్‌గా పెంటపాడుకు చెందిన ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత మేనేజర్ తాడేపల్లి మోహన్‌రావు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన స్వగృహంలో విలేకర్లకు తెలిపారు. రెండు రోజులు క్రితం భీమడోలులో జరిగిన జిల్లా సమావేశంలో తనకు అధ్యక్ష పదవిని అప్పగించిన వ్యవస్థాపక అధ్యక్షుడు పి.రామచంద్రారెడ్డికి, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మానవత పెంటపాడు మండల అధ్యక్షుడిగా, జిల్లా విద్యాకమిటీ చైర్మన్‌గా తాను సేవలందిస్తున్నట్టు చెప్పారు. 108 మందితో మానవత సంస్థ ఏర్పడినట్టు గుర్తు చేశారు. సమైక్య, శాంతిజీవనానికి మానవత సేవలు ఆదర్శమన్నారు. తమ సంస్థ రాష్ట్రంలో 13 జిల్లాల్లో విస్తరించి 50 వేల మంది సభ్యులతో సేవలందిస్తోందని వివరించారు. 250 మార్చురీ ఫ్రీజర్స్, 25 శాంతి రథాలతో పాటు, అగ్నిప్రమాదాలలో ఇళ్లు కోల్పోయిన వారికి సాయం, 18 వాటర్ ట్యాంకర్లతో సేవలు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, నోట్సు పుస్తకాలు పంపిణీ, నగదు, డిక్షనరీలు తదితర సేవలు అందిస్తున్నట్టు చెప్పారు.

నరసాపురం – కాచిగూడ మధ్య ప్రత్యేక రైళ్లు

నరసాపురం: వేసవి ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో పెట్టుకుని నరసాపురం – కాచీగూడ మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు రైల్వేట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ (భీమవరం) మధుబాబు తెలిపారు. 07653 సర్వీస్ నెంబర్‌తో ఈనెల 25న కాచిగూడ నుంచి, 26న నరసాపురం నుంచి మళ్లీ జూన్ 1న కాచిగూడ నుంచి, జూన్ 2న నరసాపురం నుంచి రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. కాచిగూడలో రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు నరసాపురం చేరకుంటాయని, నరసాపురంలో రాత్రి 7కు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు కాచిగూడ చేరుకుంటాయని వివరించారు. రిజర్వేషన్లు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొల్లేరులో చెరువులు తవ్వితే చర్యలు


పందిరిపల్లిగూడెం వద్ద సీజ్ చేసిన పొక్లెయిన్లతో ఫారెస్టు సిబ్బంది

కైకలూరు: కొల్లేరు అభయారణ్యంలో చేపల చెరువులు తవ్వితే కేసులు నమోదు చేస్తామని అటవీ శాఖ రేంజర్ జె.శ్రీనివాస్ హెచ్చరించారు. పందిరిపల్లిగూడెం కొల్లేరు అభయారణ్యంలో చెరువు అక్రమ తవ్వకాలను ఆయన ఫారెస్టు స్పెషల్ ఫోర్సుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. రెండు పొక్లెయిన్లను సీజ్ చేశారు. ఇద్దరు గ్రామపెద్దలపై కేసు నమోదు చేశారు. రెండు బృందాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజర్ జయప్రకాష్, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 20న పరీక్ష నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని, 1,831 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు 1,854 మంది, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు 49 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు ఏలూరులో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని వివరించారు. హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ కాని అభ్యర్థులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ముందుగా సంప్రదించాలని సూచించారు.

యువతి ఆత్మహత్య

ఉంగుటూరు: ప్రేమికుడు అనుమానించడంతో యువతి ఆత్మహత్యచేసుకొన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉంగుటూరు మండలం రావులపర్రు గ్రామానికి చెందిన ముల్కి వెంకన్నబాబు కుమార్తె భవాని బీఎస్సీ చదువుకుంది. ఇంట్లో ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. తన ప్రేమికడు శ్రీనివాసరావు అనుమానించటంతో ఈనెల 12 ఇంట్లోనే ఉరేసుకుంది. ఏప్రిల్ నెల 5 నుంచి శ్రీనివాస్ తనను అనుమానిస్తున్నారని ఆమె రాసిన లేఖలు, శ్రీనివాస్ ఆమెకు ఇచ్చిన ఫోన్ సంభాషణ కుటుంబ సభ్యులు ఆలస్యంగా గుర్తించారు. గ్రూపు–1 చదవాలని లక్ష్యంగా పెట్టుకున్న తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడటం నమ్మలేక పోతున్నామని తల్లితండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. తమ కుమార్తె మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని గత సోమవారం ఏలూరు స్పందనలో మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు భవాని కుటుంబీకులు తెలిపారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసనల సెగ



తణుకులో ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఇళ్ల లబ్ధిదారులు

తణుకు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదలకు అందజేసిన ఇళ్ల స్థలాలపై ప్రతిపక్షనేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై నిరసనలు వెల్లువెత్తాయి. తణుకు నరేంద్ర సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, లబ్ధిదారులు శుక్రవారం ధర్నాకు దిగారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు మాట్లాడుతూ పేదోడికి జగనన్న అందించిన సెంటు భూమి స్థలాన్ని చంద్రబాబు శ్మశానంతో పోల్చడం దుర్మార్గమన్నారు. చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దాట్ల సుందరరామరాజు, జంగం ఆనంద్‌కుమార్, కోట నాగేశ్వరరావు, షేక్ బాజీ, వీరమల్లు ఫణీంద్ర, నత్తా కృష్ణవేణి, పైబోయిన ఏసుబాబు, కుడుపూడి చంద్రరావు, షేక్ సలీం, సరెళ్ల వీరతాత తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం : రేలంగి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వకపోగా, జగనన్న ప్రభుత్వం పేదలకు ఇచ్చి స్థలాలను శ్మశానంతో పోల్చడం అతని అహంకారనికి పరాకాష్ట అని అన్నారు. నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, గ్రామ అధ్యక్షుడు పులుపు అనిల్, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, సొసైటీ అధ్యక్షుడు రాంబాబు రాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ సుబ్బరాజు, మైనం పాము, వడ్డే మార్కండేయులు, చేబ్రోలు పెద్దిరాజు, పాతూరి మోషే పాల్గొన్నారు.

అత్తిలి : చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అత్తిలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు వ్యాఖ్యలు పేదలను అవమానపరిచే విధంగా ఉన్నాయని అన్నారు. సెంటు భూమి మృతదేహాల ఖననానికి మాత్రమే ఉపయోగపడుతుందనే ధోరణిలో మాట్లాడం దుర్మార్గమన్నారు. జగనన్న ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక ఇటువంటి వ్యాఖ్యలకు దిగజారుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు హబీబుద్దీన్, బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, కంకటాల సతీష్, గంటా నాగరాజు, దిరిశాల నాగబాబు, సింగంశెట్టి శ్రీనివాస్, దాసిరెడ్డి భగవాన్, వేండ్ర రాంపండు, రాజిరెడ్డి రాజేంద్ర పాల్గొన్నారు.



రేలంగిలో వైఎస్సార్ సీపీ నేతల నిరసన



అత్తిలిలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : వాసవి క్లబ్ సభ్యుడు వి.రాంకుమార్ తల్లి వి.శోభారాణికి శుక్రవారం రూ 3,00,500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వాసవి క్లబ్ సభ్యులు ఎవరైనా ఏ కారణంగా మరణించిన ఇతర సభ్యుల సహకారంతో సురక్ష పథకం కింద ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. వాసవి క్లబ్ గవర్నర్ కొర్లేపరా కృష్ణాజీ, జోన్ చైర్మన్ నున్న నాగలక్ష్మి సుందరం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా కాలువ రేవు శుభ్రం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని టూటౌన్‌లో 23వ వార్డు గానుగుల వీధి ఎదురుగా వినాయకుడు గుడి కాలువ రేవును వార్డు సభ్యులు స్వచ్ఛందంగా శుభ్రం చేయిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పట్నాల గణపతి మాట్లాడుతూ దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచనలతో స్వచ్ఛందంగా రేవును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. తంబూరి శ్రీను, ఎం.శ్రీను, ఎస్.నారాయణ, మలపాక సుబ్రహ్మణ్య శర్మ, తోట శ్రీను, ఎస్.రాజు, తదితర సభ్యులు ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి.

క్లుప్తంగా

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ



తణుకులో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

తణుకు అర్బన్ : తణుకులోని కొమ్మాయిచెర్వు అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి అనంతరం సచివాలయ పరిధిలో నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికోసారి డ్రైడేను పాటించడం వలన ఇంటి పరిసరాలు శుభ్రపడి దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని అన్నారు. ముఖ్యంగా మురుగు కాల్వల్లో ఎటువంటి చెత్త పారవేయరాదన్నారు. దోమల నివారణను సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీవీ సూర్యనారాయణకు అభినందనలు



సూర్యనారాయణను అభినందిస్తున్న బ్యాంక్ ఛీఫ్ మేనేజర్ ప్రతాప్ కుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ) : అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం, స్టాఫ్ యూనియన్ ఏపీ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ టీవీ సూర్యనారాయణ (తాడేపల్లిగూడెం) ఏఐబీఈఏ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సూర్యనారాయణకు పూలమాలలు, శాలువాతో సన్మానించి, అభినందించారు. వ్యక్తిగత నిబద్ధత, వృత్తిలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఛీఫ్ మేనేజర్ ప్రతాప్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బండారు బెనర్జీ, ఏడుకొండలు, జాన్సన్ తదితరులు ఉన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులకు దూరం



పట్టణంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేసుకోవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల, యాగర్లపల్లి, వీకర్స్‌కాలనీ, బేబి సెంటర్‌లలో శుక్రవారం డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. సబ్ యూనిట్ అధికారి మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు, వాటి నియంత్రణా చర్యలపై పలు సూచనలు చేశారు.

బలుసులమ్మకు ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణ ఇలవేల్పు బలుసులమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొట్టు అంజిబాబు, పెదప్రోలు భాస్కర్, వట్టిప్రోలు రాము తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న ఇసుక లోడు లారీ

పెనుమంట్ర : వెలగలేరు పెట్రోల్‌బంక్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు మార్జిన్‌లో పార్కింగ్ చేసిన ఆక్వాఫీడ్ లోడుతో ఉన్న లారీని వెనుక నుంచి ఇసుకలోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇసుక లారీ ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. ఆగి ఉన్న లారీ వెనుకభాగం స్వల్పంగా దెబ్బతింది. ఇసుకలోడు లారీలో క్లీనర్ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఏలూరు జిల్లా కలిదిండికి చెందిన ఇసుకలారీ ఓనర్ చిట్టూరి సుధీర్‌కుమార్ ఫిర్యాదు మేరకు పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేశారు.

కేంద్ర నిబంధనల మేరకు ఉపాధి కూలీలకు వేతనం

సాక్షి, భీమవరం: ఉపాధి హామీ కూలీలకు కేంద్రప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనం చెల్లిస్తున్నామని జిల్లా నీటి యాజమాన్యసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌టీవీ రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్తిలి మండలం ఈడూరులో ఉపాధి హామీ కూలీలకు రూ. 600 వేతనం, 200 పనిదినాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేతా గోపాలన్ చేసిన డిమాండ్‌కు రాజేశ్వరరావు ఈ మేరకు వివరణ ఇచ్చారు.

సీడబ్ల్యూసీ గోడౌన్స్ సమస్యలపై వినతి



సమస్యలపై ఉప ముఖ్యమంత్రి కొట్టుకు వినతిపత్రం అందజేస్తున్న సోమసుందర్ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలోని సీడబ్ల్యూసీ గోడౌన్స్‌ను పూర్తి సామర్థ్యంతో పనిచేయించాలని, గోడౌన్స్‌కు మరమ్మతులు చేయించాలని, సంస్థ ఆదాయాన్ని, కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ఏడాది గోడౌన్ కేవలం ఒక్క నెల మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేసిందని, దాంతో గోడౌన్ పనులపై ఆధారపడిన 125 మంది కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయాయన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్పందించి హైదరాబాద్‌లోని సీడబ్ల్యూసీ ప్రాంతీయ మేనేజర్ నిర్మల్ బండారితో ఫోన్‌లో మాట్లాడారు. 72 వేల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన తాడేపల్లిగూడెం గోడౌన్ తమ ప్రాంతానికి ఎంతో కీలకమైనదని, దానిని పక్కన పెట్టడం తగదని వెంటనే మరమ్మతులు చేయించాలని కొట్టు సత్యనారాయణ సూచించారు. అవసరమైతే విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళతానని ఆయన ప్రాంతీయ మేనేజర్‌కు స్పష్టం చేశారు. అనంతరం స్థానిక గోడౌన్ మేనేజర్‌తో మాట్లాడారు. గోడౌన్ నిర్వహణ తీరుపై తనకు పలు ఫిర్యాదులు వస్తున్నాయని, పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అల్లికలు, మగ్గం వర్కు, కుట్టు మెషీన్లు నేర్పించే విభాగాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం మహిళలకు కుట్టు మెషీన్లు, మగ్గం వర్కు, లేసు అల్లిక వర్కులు నేర్పించే విభాగాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోను రాణించాలన్నారు. కుటుంబ సభ్యులు అందరూ పనిచేస్తేనే కుటుంబ పోషణ సులభతరమై ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం పుచ్చలపల్లి జీవిత విశేషాలను వివరించారు. కార్మిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ కార్యాలయంలో..

పట్టణంలోని ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. సీపీఎం సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబురావు, చిర్ల పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు, చల్లా చంద్రరావు, బంకురు నాగేశ్వరరావు, కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ విహారయాత్ర స్పెషల్ బస్సులు ప్రారంభం



యాత్రకు సంబంధించి పోస్టర్ విడుదల చేసిన ఆర్టీసీ డీఎం సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ) : తాడేపల్లిగూడెం డిపో నుంచి ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు విశాఖ విహార యాత్ర స్పెషల్ బస్సులను ప్రారంభించామని, ఈ బస్సులను వినియోగించుకోవాలని ఆర్టీసీ గూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ఈ యాత్రంలో సుప్రసిద్ధ సింహాచలం దేవాలయం దర్శనం, కైలాసగిరి, వుడా పార్క్, నేవీ మ్యూజియం, సబ్ మెరైన్, ఆర్‌కే బీచ్, కాశీ టెంపుల్ చూపించనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయంనకు బస్ తాడేపల్లిగూడెం డిపోనకు చేరుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సులకు టికెట్ ధర పెద్దలకు రూ.1650, పిల్లలకు రూ.810గా నిర్ణయించామన్నారు. అదే విధంగా జూన్ 2న డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్ర స్పెషల్ బస్సు బయలు దేరుతుందని తెలిపారు. ఈ బస్సు కాళహస్తీశ్వరస్వామి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, గిరి ప్రదక్షిణ, అనంతరం 5వ తేదీన తిరిగి వస్తుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర రూ 2,600గా నిర్ణయించినట్లు వెల్లడించారు.

మండపాకలో ఫ్యామిలీ ఫిజీషియన్

తణుకు టౌన్ : తణుకు మండలం మండపాక గ్రామంలో 1వ సచివాలయం వద్ద రేలంగి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బంగారు రవి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో టీఎస్‌మూర్తి, ఐసీడీఎస్ సీడీపీవో ఎం ప్రయోదినికుమారి, సూపర్‌వైజర్ కృష్ణ కుమారి తదితరులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యుగంధర్ శ్రీనివాస్, ఆరోగ్య సహాయకులు వైటీ మూర్తి, పర్యవేక్షకులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శమని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక మాగంటి కళ్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణ, మండలాల్లోని వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులతో సత్కరించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో 1370 మంది వలంటీర్లకు రూ. 1.39 లక్షల విలువైన పురస్కారాలను అందచేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,33,719 మందికి రూ. 243.34 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో 8533 మందికి రూ.8.73 కోట్లు పురస్కారాలు అందచేశారన్నారు. పూజ్య బాపూజి కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆచరణలో అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకే అందచేసే విధంగా పాలనలో మార్పులు తీసుకువచ్చి సచివాలయ వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ సేవల్లో మేటిగా వలంటీర్లు నిలిచారని అన్నారు. మూడవ సారి వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. కోవిడ్ విజృంభించిన సమయంలో వలంటీర్లు అందించిన సేవలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. జిల్లాలో 8370 మంది సేవామిత్రలు, 128 మంది సేవారత్నలు, 35 మంది సేవావజ్రాలను ఎంపిక చేశారని ప్రశాంతి తెలిపారు. వలంటీర్ల సేవలకు ఉపముఖ్యమంత్రి, కొట్టు, జిల్లా కలెక్టర్ ప్రశాంతి అభినందనలు తెలిపారు. అనంతరం సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అర్చన, ఆర్‌డీఓ దాసిరాజు, తహసీల్దార్ అప్పారావు, జెడ్పీటీసీలు ముత్యాల ఆంజనేయులు, వరలక్ష్మి, ఎంపీపీలు దాసరి హైమావతి, పొనుకుమాటి శేషులత పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు



వేల్పూరు గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తణుకు టౌన్ : గ్రంథాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం తణుకు పట్టణంలోని మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలను నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం, ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం, చెస్, బిజినెస్, అంత్యాక్షరి ఆటపాటలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. అలాగే వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి : అత్తిలి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులతో కథలు చెప్పించడం, ఇంగ్లిషు పదాలను పూరించడం, పుస్తక సమీక్ష జరిపారు. ఉపాధ్యాయిని కె.కోమలి భగవద్గీత శ్లోకాలు, పెద్దబాలశిక్షపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా చిన్నారి కె ధాత్విక ప్రదర్శించిన కూచిపూడి డ్యాన్స్ అలరించింది. కార్యక్రమంలో గంధం శేషవేంద్రరావు, జి.గణపతి, రంగినీడి దానకృష్ణ, జి.నాగేశ్వరరావు, ఎం.శ్రీదేవి, గ్రంధాలయాధికారి డి.కృష్ణారావు పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, చదరంగ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సత్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



అత్తిలి శాఖా గ్రంథాలయంలో చిన్నారి నృత్య ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని పలువురు విశ్రాంత ఉద్యోగులు పేర్కొన్నారు. పట్టణంలోని గ్రేడ్ – 1 శాఖ గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణా విజ్ఞాన తరగతులను గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రత్తి వీరాస్వామి, ఎన్.సాల్మన్‌రాజు, మహాశివభట్టు లక్ష్మణరాజు, భాస్కరరావు తదితరులు విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్వీట్లు పంచారు.

23న శ్రీవాసవి డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ డ్రైవ్

తాడేపల్లిగూడెం (టీఓసీ) : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం శ్రీ వాసవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 23వ తేదీన మినీ జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపున్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్ మధుభూషణరావు తెలిపారు. ఈ డ్రైవ్‌నందు టెక్ మహీంద్రా, హెటేరో లాబ్స్ లిమిటెడ్ కంపెనీ, కస్టమర్ సపోర్ట్ అసోసియేట్, జూనియర్ కెమిస్ట్, జూనియర్ టెక్నీషియన్, జూనియర్ ఆఫీసర్ సంబంధిత ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల చైర్మన్ నారాయణ రమణరావు, ప్రిన్సిపాల్ మద్దాల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. వివరాలకు డి.ప్రసన్నను 70138 96277 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సుందరయ్య జీవితం ఆదర్శనీయం



తాడేపల్లిగూడెంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



నందమూరులో సుందరయ్య చిత్రపటం వద్ద జోహార్లు అర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య నేర్పిన పోరాట స్ఫూర్తిని అనుసరిద్దామని, హక్కులను చట్టాలను కాపాడుకొందామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో పి.వేణుగోపాల చౌదరి అధ్యక్షతన నిర్వహించారు. సీతారాం మాట్లాడుతూ సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయం అన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేసి, అనేక త్యాగాలు చేశారని వెల్లడించారు. అనేక పోరాటాలు చేసి సాధించుకొన్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఐక్య పోరాటాల ద్వారా కార్మిక వర్గంపై చేస్తున్న దాడులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కార్మిక నాయకులు, కార్మికులు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

తాడేపల్లిగూడెం రూరల్ : వ్యవసాయ కూలీల హక్కులకై పోరాడిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని నందమూరు గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కండెల్లి రమేష్‌బాబు, జి.సర్వేశ్వరరావు, మార్లపూడి సూరిబాబు, వీరెల్లి పోతురాజు, ఆరుగుల మునీశ్వరరావు, ప్రత్తిపాడు చంద్రమ్మ, కె.రత్నం, కె.నరేష్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఇటుకులగుంటలో...

అఖిల భారత ప్రజాతంత్ర ఆధ్వర్యంలో ఇటుకులగుంట గ్రామంలో శుక్రవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి ఐద్వా నాయకురాలు పాలుపూరి సత్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుందరయ్య జీవితం ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పాలుపూరి వెంకాయమ్మ, నాగమణి, సుబ్బలక్ష్మి, వీరమణి, కె.శిరీష, పి.ధనలక్ష్మి, పి.సత్యవతి పాల్గొన్నారు.